ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్ జిల్లాల వార్తలు
5
శుక్రవారం 17 మే 2024



డిగ్రీ ప్రవేశాలకు దోస్త్

- నోటిఫికేషన్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి
- అడ్మిషన్లు ప్రారంభం.. 25 వరకు తొలి విడత 7
- జూలై 7తో ప్రవేశాలు పూర్తి.. 8 నుంచి తరగతులు
- మెదక్ జిల్లాలో 4 డిగ్రీ కళాశాలల్లో 1,620 సీట్లు



కొల్చారం మండలం తుక్కాపూర్‌లో వర్షపు నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం



చేగుంటలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వరద నీరు



పాపన్నపేటలో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన వర్షపు నీరు



మాసాయిపేటలో వర్షానికి కొట్టుకుపోయిన వడ్లు



శేరిపల్లిలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం, తడిసిన ధాన్యం బస్తాలు

అన్నదాత ఆగమాగం

వడ్లు వర్షార్పణం

- మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో పలుచోట్ల జోరు వాన
- తడిసి ముద్దయిన ధాన్యం



కంది మండలం చిమ్నాపూర్‌లో కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

మెదక్/కొల్చారం/రామాయంపేట/చేగుంట/మాసాయిపేట/వెల్దుర్తి/ మే 16: వర్షాకాలానికి ముందే జోరువానలు కురుస్తున్నాయి. మెదక్ జిల్లావ్యాప్తంగా గురువారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వెల్దుర్తి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యం వర్షానికి తడిసి ముద్ద యింది. రైతులు తెచ్చిన ధాన్యాన్ని నిర్వాహకులు తూకంవేసి బస్తాల్లో నింపారు. సాయంత్రం హఠాత్తుగా వర్షం కురియడంతో ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. కొల్చారంలో తూకం వేసిన ధాన్యాన్ని తరలించడంలో జాప్యం జరగడంతో వర్షానికి తడిసిపోయాయి. మెదక్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడుస్తున్నదని, సరిపడా టార్పాలిన్లు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొల్చారం మండలంలోని పలు గ్రామాల్లో వర్షానికి వరి కుప్పలు తడిసిపోయాయి. కొనుగోలు కేంద్రాలకు లారీలు రావడం లేదు. దీంతో రంగంపేట, సంగాయిపేట, తుక్కాపూర్, కొనాపూర్ తదితర గ్రామాల్లో ధాన్యం రాశులు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. తూకం పూర్తయినా బస్తాలను మిల్లులకు తరలించకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయి. వర్షానికి ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. రామాయంపేటలో గంటన్నర పాటు కుండపోత వర్షం కురియడంతో రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. వర్షానికి చేగుంట గ్రామ పంచాయతీ కార్యాలయం, బస్టాండ్ జలమయమయ్యాయి. వరదతో రోడ్లపై చెత్త పేరుకుపోయింది.

పాపన్నపేట మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం కుప్పలు తడిసి ముద్దవుతున్నాయి కాంటా చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడానికి అధికారులు ఆయినా సమయంలో లారీలను పంపకపోవడంతో వారం రోజులుగా కల్లాలలోనే ఉంటున్నాయి. నిజాంపేట మండలంలో అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నందగోకుల్ గ్రామంలో గురువారం కురిసిన వర్షాని కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిముద్దయింది.

చేగుంట మండలంలో తూకానికి సిద్ధం చేసిన ధాన్యం అకాల వర్షానికి కొట్టుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నార్సింగ్ మండలంలోని షేర్‌పల్లి, జప్తిశివనూర్, నార్సింగి తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. రోడ్లపై ఆరబోసిన ధాన్యం కొట్టుకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల కేంద్రమైన మాసాయిపేటలో భారీ వర్షం కురవడంతో ధాన్యం రాశులు వరదలో కొట్టుకుపోయాయి. మాసాయిపేటలోని కొనుగోలు కేంద్రం రైతులు తీసుకువచ్చిన ధాన్యం తడిసిపోయింది. మజీద్ బండ ఆవరణలో ఆరబోసిన వరి ధాన్యం కొట్టుకుపోయింది. వెల్దుర్తి మండలంలో అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన వడ్లు తడిసిపోయాయి. కల్లాల్లో, రోడ్ల పక్కన ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డిటౌన్/సంగారెడ్డిరూరల్/కోహీర్, మే 16 : సంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. ఈదురుగాలులకు వడ్ల కుప్పలపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. సంగారెడ్డి, నారాయణఖేడ్, వట్‌పల్లి, సదాశివపేట, హత్నూర, కొండాపూర్, పుల్కల్, చౌటకూర్ తదితర మండలాల్లో భారీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా వట్‌పల్లిలో 30 మి.మి., వర్షం కురియగా పటాన్‌చెరు, అందోల్, అమీన్‌పూర్ మండలాల్లో అత్యల్పంగా 0.8 మి.మి.,ల వర్షం కురిసింది. సదాశివపేటలో 28.3 మి.మి., సంగారెడ్డిలో 23.3 మి.మి., హత్నూర, కొండాపూర్‌లో 17.8 మి.మి., గుమ్మడిదలలో 13 మి.మి., మునిపల్లిలో 11.8 మి.మి., పుల్కల్‌లో 10.8 మి.మి., జిన్నారంలో 10.5 మి.మి., కోహీర్‌లో 6.3 మి.మి., కందిలో 1.3 మి.మి.,ల వర్షపాతం నమోదయింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండగా.. మధ్యాహ్నం భారీ వర్షం కురియడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో ప్రారంభమై రెండు గంటలు ఏకధాటిగా వర్షం కురిసింది. సంగారెడ్డి పట్టణంలో డ్రైనేజీలు పొంగిపొర్లడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. మూడు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

అలాగే, మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మనియార్‌పల్లి, బడంపేట, సజ్జాపూర్, మాచిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. బిలాల్‌పూర్ గ్రామంలో వడగండ్లు పడ్డాయి. ఈదురుగాలులు, వడగండ్ల వానకు అరటి పంటకు నష్టం వాటిల్లింది. అలాగే తాండూర్‌కు వెళ్లే రహదారికి అడ్డంగా చెట్లు విరిగిపడ్డాయి.

పిడుగుపాటుకు మేకలు మృతి

పాపన్నపేట: పిడుగుపాటుకు మూగజీవాలు మృతిచెందిన ఘటన పాపన్నపేట మండల పరిధిలోని అరేపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం అరేపల్లి గ్రామానికి చెందిన మస్కూరి హన్మంతు తన మేకలను మేత కోసం తన వ్యవసాయక్షేత్రానికి తోలుకువెళ్లాడు. ఈదురుగాలులు, ఉరుములతో ఒక్కసారిగా జీవాలపై పిడుగుపడింది. దీంతో, 10 మేకలు మృతి చెందాయి. లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు.

గడ్డివాము దగ్ధం..

హత్నూర: మండల కేంద్రమైన హత్నూరలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన పుట్లగారి లింగయ్య గ్రామ శివారులోని తన పొలం వద్ద గడ్డివాము వేసుకున్నాడు. గురువారం పిడుగు పడి 150 గడ్డిమోపులు దగ్ధమయ్యాయి



కోహీర్‌లో..



సంగారెడ్డిలో..



వెల్దుర్తిలో తూకం వేసి సంచుల్లో నింపిన ధాన్యం తడిసిన దృశ్యం

వడ్లు కొనాలంటూ.. రైతుల రాస్తారోకో

రామాయంపేట, మే 16: అకాల వర్షాలకు ఆరబోసిన ధాన్యం తడుస్తున్నా కొనుగోలు చేయడం లేదని ఆగ్రహంతో అన్నదాతలు రాస్తారోకో చేశారు. రెండు గంటల పాటు రామాయంపేట-గజ్వేల్ రహదారిని నిర్బంధించారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో సీజన్ పూర్తి కావస్తున్నా వడ్లు తూకం వేయడం లేదని, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని రైతులు ఈ ఆందోళనకు దిగారు. రోడ్డుపై రెండు గంటలు భైఠాయించారు. తడిసిన ధాన్యాన్ని రోడ్డుపై పోసి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ,ధాన్యం కొనేదాకా రాస్తారోకో విరమించమంటూ మొండికేశారు. పోలీసులు చేరుకుని సముదాయించటంతో రైతులు శాంతించారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు

స్ట్రాంగ్‌రూం వద్ద మూడంచెల భద్రత

- సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి



స్ట్రాంగ్‌రూం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు రూరల్, మే 16 : ఈవీఎంలను భద్రపర్చిన రుద్రారం గీతం యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూం వద్ద మూడంచెల పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు. గీతం యూనివర్సిటీలోని స్ట్రాంగ్‌రూంను గురువారం ఆమె పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో సిబ్బంది కోసం అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని పేర్కొన్నారు. పోలింగ్ అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించి భద్రపర్చినట్టు తెలిపారు. ఈ నెల 4న జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరగనున్న ప్రాంగణంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఆమెవెంట ట్రెయినీ కలెక్టర్ మనోజ్, ఈఈ సురేష్, తహసీల్దార్ రంగారావు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తిచేయాలి

కంది, మే 16 : ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. మండల కేంద్రమైన కందిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె అడిషనల్ కలెక్టర్ మాధురితో కలిసి పరిశీలించారు. గోనెసంచులు, లారీల కొరత ఉందా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం లోడ్‌చేసి పంపించిన లారీలను రైస్‌మిల్లుల వద్ద త్వరగా అన్‌లోడ్ చేయించాలని నిర్వాహకులు కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీసీవో ఇంతియాజ్, డీఎస్‌వో వనజ, వ్యవసాయశాఖ ఏడీ నర్సింగరావు, పీఏసీఎస్ చైర్మన్ దొడ్ల ప్రభాకర్‌రెడ్డి, సీఈవో మందాడ శ్రీధర్‌రెడ్డి, ఏఈవో కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గడువు లోపు 'సీఎంఆర్' అప్పగించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



నర్సాపూర్ మండలం రెడ్డిపల్లిలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, మే 16: సీఎంఆర్ బియ్యాన్ని త్వరితగతిన ప్రభుత్వానికి అప్పగించాలని మిల్లర్లకు మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలోని వెంకటేశ్వర రైస్‌మిల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని మిల్లర్లందరూ సీఎంఆర్ బియ్యం అప్పగించాలని సూచించారు. సీఎంఆర్‌లో జిల్లాను రాష్ట్రంలోనే మెదటిస్థానంలో నిలపాలని సూచించారు. రోజువారీ బియ్యం పంపిణీపై సమీక్ష చేసి నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరికృష్ణ తదితరులు ఉన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోనస్ ఇస్తామంటూ కాంగ్రెస్ మోసం

- రైతుల పాలిట శాపమైన కాంగ్రెస్ పాలన
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు 8
- ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసనలు

ట్రేడ్ లైసెన్స్‌కు రూ. 30 వేలు డిమాండ్

- ఏసీబీ వలలో చిక్కిన నర్సాపూర్ వ్యవసాయశాఖ ఏవో 7

నత్తనడకన కొల్లూరు ఆర్‌వోబీ జంక్షన్

- ప్రమాదకరంగా మారిన సర్వీస్ రోడ్డు
- పాటి, ఘనాపూర్, వెలిమెల గ్రామాలకు వెళ్లాలంటే తప్పని తిప్పలు
- రియల్ ఎస్టేట్ విస్తరణకు అడ్డంకిగా సర్వీస్ రోడ్డు 7

మల్లన్నగుట్టపై దుకాణాల తొలగింపు

- అటవీశాఖ చర్యలు



దుకాణలను తొలగిస్తున్న అటవీశాఖ అధికారులు

దుబ్బాక, మే16 : దుబ్బాక రేకులకుంట మల్లన్న ఆలయం వద్ద అటవీశాఖ అధికారులు దుకాణ సముదాయాలను కూల్చివేశారు. అటవీ శాఖ భూముల్లో దుకాణ సముదాయాలు ఏర్పాటు చేశారని బుధవారం రాత్రి, గురువారం ఉదయం డీఆర్వో రమేష్, ఎఫ్‌బీవోలు రామకృష్ణ, శ్రీకాంత్‌తోపాటు పలువురు సిబ్బంది మల్లన్నగుట్ట పరిసర ప్రాంతంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దుకాణ సముదాయాలను, గుడిసెలను తొలగించారు.

దేవాదాయ, అటవీ శాఖల మధ్య వివాదం

దుబ్బాక మండలం పెద్దచీకోడు ఫారెస్టు రేంజ్ పరిధిలో మల్లన్నగుట్ట ఆలయం ఉంది. దుబ్బాక శివారులోని సొంత స్థలంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం మూడు ఎకరాల్లో ఆలయం విస్తరించి ఉంది. అయితే, చుట్టూ అటవీ భూములు కాగా, దేవాదాయ, అటవీశాఖ మధ్య కొన్నేళ్లుగా ఈ విషయంలో వివాదం నెలకొంది. నట్టడివిలోని దేవాలయానికి కనీసం రహదారి ఏర్పాటుకు కూడా అటవీశాఖ అనుమతినివ్వలేదు. దుబ్బాక నుంచి రహదారి ఏర్పాటు చేస్తే, రిజర్వు ఫారెస్టు అధికారులు పలువురిపై కేసులు కూడా నమోదు చేశారు. అయితే, రాజక్కపేట నుంచి ఆలయానికి రహదారి ఉంది. ఫారెస్టు భూమి కోసం కేంద్ర ప్రభుత్వాన్ని, అటవీశాఖకు రాష్ట్ర దేవాదాయ శాఖ విన్నవించింది. అనుమతులు రావడంలో జాప్యం కావడంతో స్థానిక అటవీశాఖ అధికారులు ఆలయం చుట్టూ కనీసం విడిదికి కూడా అవకాశం లేకుండా అన్నీ తొలగిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం దాతలతో నిర్మించిన సత్రాలను కూడా తొలగించారు. ఏడాది పొడవునా ప్రతీ ఆది, మంగళవారం రాత్రులు ఇక్కడికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు లేవు. వానలకు, ఎండలకు విడిది లేకుండా పోయింది. ఓవైపు భక్తులు అవస్థలు పడుతుంటే, మరో పక్క అటవీ అధికారులు దుకాణాలను, గుడిసెలను తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న సేవాసమితి సభ్యులు

చేర్యాల, మే 16 : ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో గురువారం కానుకలు, ఒడిబియ్యం హుండీల లెక్కింపులు చేపట్టారు. ఈసందర్భంగా ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.రంగారావు పర్యవేక్షణలో సత్యసాయి సేవాసమితి మహిళాసభ్యులు కరెన్సీని లెక్కించారు. రూ.1,16,51,672నగదు, 70గ్రాముల బంగారం, 10కిలోల వెండి, 23క్వింటాళ్ల ఒడిబియ్యం, 18విదేశీ కరెన్సీనోట్లు లభ్యమైనట్లు ఈవో తెలిపారు. కొద్ది రోజుల స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసినప్పటికీ భక్తులు భారీగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకోవడంతో ఈ ఆదాయం 46రోజుల్లో సమకూరినట్లు తెలిపారు. లెక్కింపులలో ఆలయ ఏఈవోలు బుద్ధి శ్రీనివాస్, గంగా శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జికి బాధ్యులైన వారిని శిక్షించాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకులు

చిన్నశంకరంపేట, మే 16: ఉపాధ్యాయుల లాఠీచార్జికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని టీఎస్ ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజగోపాల్, కర్రె పోచయ్య డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఉపాధ్యాయ వృత్తి గొప్పదన్నారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వారి సేవలు అమోఘమన్నారు. ఎన్నికల విధి నిర్వహణలో పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేకున్నా విధులను సమర్థవంతంగా పూర్తిచేశారని తెలిపారు. నారాయణఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



నల్లపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి



కొండాపూర్: కలశాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

భక్తులతో నల్లపోచమ్మ ఆలయం కిటకిట

మనూరు, మే 16: తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన బోరంచ నల్లపోచమ్మ ఏడువారాల జాతర గురువారం ప్రారంభమైంది. మనూరు మండలం దుద్గొండ గ్రామస్థులు బోనాలతో వచ్చి ఆలయాన్ని దర్శించుకున్నారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కళాశాల ఊరేగింపు

కొండాపూర్, మే 16: మండల పరిధి మారెపల్లిలో లక్ష్మీనారాయణస్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపిస్తున్నారు. గురువారం పంచామృత సహిత కలశాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకం, అంకురార్పణ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు, అన్నదానాలు చేశారు.

షాపింగ్‌మాల్‌లో తెగిన లిఫ్ట్ వైర్లు

- మూడో అంతస్తు నుంచి లిఫ్ట్‌తో పాటు కిందపడిన కస్టమర్లు
- ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- ఓ మహిళ పరిస్థితి విషమం
- సదాశివపేటలో ఘటన

సదాశివపేట, మే 16: సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని కాసమ్ షాపింగ్‌మాల్‌లో లిఫ్ట్ తెగి ఎనిమిది మంది కస్టమర్లు తీవ్రగాయాలపాలయ్యారు. మండలంలోని రేజింతల్ గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు చెందిన మహిళలు, పిల్లలు గురువారం షాపింగ్ కాసమ్ షాపింగ్‌మాల్‌కు వచ్చారు. మాల్‌లోని లిఫ్ట్ ఎక్కారు. అంతలోనే లిఫ్ట్ కేబుల్ (వైరు) తెగిపోవడంతో మూడో అంతస్తు నుంచి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఒక్కసారిగా పడిపోయారు. ఈ ఘటనలో 8 మందికి తీవ్రగాయాలు కాగా.. ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉన్నది. స్పందించిన స్థానికులు, సమాచారం అందుకున్న పోలీసులు షాపింగ్‌మాల్‌కు చేరుకుని లిఫ్ట్‌లో ఇరుక్కున్న మహిళలను, పిల్లలను బయటకుతీశారు. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. లిఫ్ట్ దుర్ఘటనకు నాసిరకం కేబుల్, నాణ్యతా ప్రమాణాలు లేని లిఫ్టే కారణంగా తెలుస్తున్నది. ఇదిలా ఉండగా కాసమ్ షాపింగ్‌మాల్‌లోని నాలుగో అంతస్తుకు అనుమతి లేదని మున్సిపల్ అధికారులు తెలిపారు. మున్సిపల్ నుంచి పూర్తిగా రెసిడెన్షియల్ అనుమతులు పొంది.. ఆ తర్వాత కమర్షియల్ షాపింగ్ మాల్ నిర్మాణం చేపట్టారు. అలాగే పార్కింగ్ లేకుండా లిఫ్టులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మహిళలకు, పిల్లలకు కాసమ్ షాపింగ్‌మాల్ యాజమాన్యం మెరుగైన చికిత్స అందించి నష్టపరిహారం చెల్లించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



సదాశివపేటలోని కాసమ్ షాపింగ్‌మాల్

ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక సందడి

చేర్యాల, మే 16: వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికలో భాగంగా సిద్దిపేట జిల్లా పరిధిలోని చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాల్లో సందడి మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నికల నిర్వహణకు సన్నాహకాలు చేపట్టగా, ఈనెల 27న పోలింగ్ జరగనుండటంతో పట్టభద్రుల్లో మరోమారు ఎన్నికల జోష్ నెలకొంది. మూడు ఉమ్మడి జిల్లాలలోని 12జిల్లాలలో మొత్తం 2,88,189 మంది పురుషులు, 1,75,645 మంది మహిళలు, 5గురు థర్డ్‌జెండర్ల చొప్పున మొత్తం 4,63,839మంది ఓటర్లు ఉన్నారు. ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు మొత్తంగా 52మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. నాలుగుసార్లు జరిగిన ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందగా, ప్రస్తుత సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నం చేస్తుంది. అలాగే కాంగ్రెస్, బీజేపీలు సైతం విజయబావుట ఎగురవేయడానికి వ్యూహరచన చేస్తున్నాయి. ఎన్నికలకు కేవలం పదిరోజులే ఉండటంతో పార్టీల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ, పట్టభద్రులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పట్టభద్రులు ఎవరికి పట్టం కడతారన్న విషయం ఆసక్తికరంగా మారింది.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కుకునూరుపల్లి, మే 16: కుకునూరుపల్లి మండలంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటరమణ మాట్లాడుతూ.. కళాశాలలోని ఐదు ట్రేడ్ విభాగాల్లో ఒక సంవత్సరం, రెండు సంవత్సరాలకు సంబంధించిన కోర్సులే ఉన్నాయని, ఐటీఐ తెలంగాణ. జీవోవీ. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా పీఎం విశ్వకర్మ వృత్తి విద్యా కోర్సుల్లో స్వల్పకాలిక దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, పీఎం విశ్వకర్మ వృత్తి విద్యలో నమోదు చేసుకోవడం కోసం ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, రేషన్‌కార్డు అవసరమని, పీఎం విశ్వకర్మ. జీవోవీ. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణతో పాటు పారితోషికం అందిస్తారని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్, రూ.15వేల టూల్ కిట్ ఉచితంగా అందిస్తారని తెలిపారు. మే 16 నుంచి దరఖాస్తు తీసుకోవచ్చని జూన్ 10 చివరి తేదీ అని తెలిపారు. ఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి పదవ తరగతి పూర్తి చేసి 18 నుంచి 45 సంవత్సరాల వారు అర్హులు అని మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9849939025 లేదా కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

బీజేపీ నేతల ముందస్తు సంబురాలు

● మెదక్‌లో రఘునందన్ గెలుపుపై ధీమా



విజయసంకేతం చూపుతున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట, మే 16: మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు ఖాయం అయిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి ముందస్తు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులైన ప్రజలు బీజేపీకి పట్టం కడుతున్నారని చెప్పారు. నరేంద్రమోదీ నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి



అంజయ్య(ఫైల్)

కొండాపూర్, మే 16: బైక్ అదుపు తప్పి ఒకరు మృతిచెందారు. ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ వివరాల ప్రకారం.. సైదాపూర్ గ్రామానికి చెందిన పెద్దగొల్ల అంజయ్య(45) వ్యవసాయం చేస్తుంటాడు. బుధవారం గంగారం గ్రామంలో బంధువుల ఇంట్లో విందుకు వెళ్లాడు. అదేరోజు రాత్రి 11 గంటలకు బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. అనంతసాగర్ గ్రామ శివారులోని సోలార్ ప్లాంట్ వద్దకు రాగానే తాను ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అంజయ్య తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మరో ఘటనలో..

గజ్వేల్, మే 16: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందాడు, ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన గజ్వేల్ మండలం జాలిగామ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన అరుణ్, కరుణాకర్, చిక్కుడు కరుణాకర్ ముగ్గురు గజ్వేల్ నుంచి దౌల్తాబాద్ వెళ్తుండగా, జాలిగామ శివారులో రోడ్డుపై పోసిన మట్టి కారణంగా బైక్ అదుపు తప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో అరుణ్(31) అక్కడికక్కడే మృతి చెందగా కరుణాకర్, చిక్కుడు కరుణాకర్‌కు గాయాలయ్యాయి. గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణంలో భాగంగా గుంతలు తీసి మట్టిని రోడ్డుపై పోయడం, ఎలాంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి సోదరుడు శివ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

'పెట్రోల్‌లో ఎలాంటి కల్తీ లేదు'



శాంపిల్స్ పరిశీలిస్తున్న బీపీసీఎల్ అధికారులు

ములుగు, మే 16: బీపీసీఎల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పంపుల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా, వారి లైసెన్స్ రద్దు చేస్తామని బీపీసీఎల్ అధికారి ప్రశాంత్ హెచ్చరించారు. మండల కేంద్రమైన ములుగులో శ్రీ విద్యా సరస్వతి పంపులో బుధవారం పెట్రోల్‌లో నీరు వచ్చినట్లుగా వాహనదారులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఆయన సేల్స్ ఆఫీసర్ మనివిందర్‌సింగ్‌తో కలసి పెట్రోల్ బంకులోని ట్యాంక్ నుంచి పోలీస్ అధికారుల సమక్షంలో పెట్రోల్ తీసి పరిశీలించగా, ఎలాంటి కల్తీ లేదని పెట్రోల్ బాగానే ఉందని నిర్ధారించారు. దీనిపై వారు మాట్లాడుతూ.. వాహనదారులకు నాణ్యమైన పెట్రోలు అందించడమే లక్ష్యంగా బీపీసీఎల్ కార్పొరేషన్ పనిచేస్తున్నదని, వాహనదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. ఆయనవెంట ఎస్ఐ ప్రేమ్‌కుమార్, పోలీస్ సిబ్బందితో పాటు పంపు యజమానులు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సాయిప్రకాష్ (ఫైల్)

సిద్దిపేట క్రైం, మే 16: గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటుచేసుకున్నది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఆరుట్ల సాయిప్రకాష్ (29) నారాయణరావుపేట ఎంపీడీవో కార్యాలయంలో సబ్‌ఆర్డినేట్‌గా పనిచేస్తున్నాడు. తన మిత్రులైన ఇద్దరికి అతడు కొంత మొత్తం అప్పుగా ఇచ్చాడు. తిరిగి డబ్బులు ఇవ్వమంటే వారు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఈ నెల 13వ తేదీన గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఆరుట్ల వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పీహెచ్‌సీలను సందర్శించిన డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్

సంగారెడ్డి అర్బన్, మే 16: సంగారెడ్డి జిల్లాలోని కొండాపూర్, హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ మనీషాపటేల్ గురువారం సందర్శించారు. ఆయా పీహెచ్‌సీల పరిధులలో క్షేత్రస్థాయిలో లెప్రసీ, ఫైలేరియా, మలేరియా వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆమె ఆరాతీశారు. ఆయా వ్యాధులను అరికట్టేందుకు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత మెడికల్ ఆఫీసర్, వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయా పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో సమావేశమై ఆయా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహనా కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హత్నూర పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ మనీషాపటేల్

డిగ్రీ ప్రవేశాలకు దోస్త్

- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఉన్నత విద్యామండలి
- ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు ప్రారంభం
- జూలై 7తో ప్రవేశాలు పూర్తి.. 8 నుంచి తరగతులు
- 25 వరకు తొలి విడత గడువు
- బీకాం కోర్సుకే ఎక్కువమంది ఆసక్తి
- మెదక్ జిల్లాలో 4 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు.. 1,620 సీట్లు

మెదక్ అర్బన్, మే 16: డిగ్రీలోకి ప్రవేశించాల కోసం విద్యార్థులను దోస్త్ పిలుస్తోంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి 2024-25 సంవత్సరానికి నోఫికేషన్ జారీచేసింది. విద్యార్థి జీవితంలో డిగ్రీ దశ అత్యంత కీలకమైంది. ఇక్కడ చూపిన ప్రతిభాపాటవాల ఆధారంగానే భవిష్యత్ చదువులు.. ఉద్యోగావకాశాలు ఆధారపడి ఉంటాయి. అందుకే చాలా మంది విద్యార్థులు ఉత్తమ అధ్యాపకులు, ఆధునిక సౌకర్యాలు ఉన్న కళాశాలల్లో చదివేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఇందుకు ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు వేదికగా నిలుస్తున్నాయి. తొలి విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 25 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. మూడు విడతల్లో జరిగే అడ్మిషన్ల ప్రక్రియ జూలై 7తో ముగియనున్నది. ఆ వెంటనే తొలి సెమిస్టర్ తరగతులు జూలై 8 నుంచి ప్రారంభమవుతాయి. విద్యార్థులకు దోస్త్ వెబ్‌సైట్‌తో పాటు దోస్త్ మొబైల్ యాప్‌లో ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు పొందే అవకాశం ఉన్నది. మెదక్ జిల్లాలోని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1,020 సీట్లు, నర్సాపూర్ కళాశాలలో 240, రామాయంపేట, రామాయంపేటలో 180 , కొడిపల్లి డిగ్రీ కళాశాలలో 180 సీట్లు, జిల్లావ్యాప్తంగా 7 ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ఒక్కొక్క కళాశాలల్లో దాదాపు 240 సీట్లు ఉన్నాయి.



మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

రెండు కొత్త కోర్సులు..

డిగ్రీ స్థాయిలో కొత్తగా రెండు కోర్సులు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాది నుంచి బీకాం ఫైనాన్స్, బీఎస్సీ బయో మెడికల్ సైన్స్ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి.

సత్వర ఉపాధి అవకాశాల కోసమే..

సాధారణంగా ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, ఎంఈసీ కోర్సులు అభ్యసించిన విద్యార్థులు ఇంజనీరింగ్ వైపు మళ్లుతున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో కావాల్సిన సీట్లు అందుబాటులో ఉండటం, ఉపకార వేతనంతో పాటు ఫీజులు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. బైపీసీ కోర్సులు చదివిన విద్యార్థులు ఫార్మసీ కోర్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. మిగిలిన సీఈసీ, హెచ్ఈసీ, ఇతర కోర్సులకు సంబంధించిన విద్యార్థులే. వీరందరూ ఇతర మార్గాలు లేకపోవడంతో తక్కువ కాలంలో ఉద్యోగాల్లో స్థిరపడాలనే ఆలోచనతో బీకాం కోర్సులను అత్యధికంగా ఎంపిక చేసుకుంటున్నారు. ఫైనాన్స్, మార్కెటింగ్, మేనేజ్‌మెంట్, అకౌంటింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, రిసోర్సెస్‌తో సహా అనేక కెరీర్ ఎంపికలను బీకాం అందిస్తోంది. బీకాం డిమాండ్ పెరగడంతో బీఏహెచ్ఈసీ కోర్సుతో పాటు ఈ ఏడాది కొత్తగా అప్రెంటిస్‌షిప్ కోర్సులు టూరిజం, ట్రావెల్స్, రిటైల్ ఆపరేషన్ అందుబాటులోకి వచ్చాయి. బీఏ ద్వారా గ్రూప్స్‌కు ఉద్యోగావకాశాలు సాధించాలనుకునే విద్యార్థులకు ఉపయోగకరం. ఖాళీ సమయం దొరికితే చాలు టూర్స్ వెళ్తాం. టూరిస్ట్ ఏరియాల్లో చారిత్రక ప్రదేశాలను చూపించటానికి గైడ్స్, ట్రావెల్స్ ఆన్‌లైన్ బుకింగ్ చేయడానికి ఉద్యోగావకాశాల కోసం టూరిజం, ట్రావెల్స్ కోర్సు తీసుకొచ్చారు. బీబీఏ, బీఎస్సీ, బీజడ్సీ కోర్సులను తక్కువ మంది విద్యార్థులు ఎంచుకుంటున్నారు.


దోస్త్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ హుస్సేన్, అధ్యాపకులు

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

డిగ్రీ కళాశాలల్లో చేరడానికి నోఫికేషన్ విడుదలైంది. అర్హులైన విద్యార్థులంతా దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దోస్త్ అడ్మిషన్లలో సందేహాల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. రిజిస్ట్రేషన్ చేసుకునే క్రమంలో ఏమైనా తప్పులు జరిగితే హెల్ప్‌లైన్ సెంటర్‌కు వచ్చి సవరణ చేసుకునే అవకాశం ఉన్నది. అలాగే డిగ్రీ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి కొత్తగా బీబీఏ(లాజిస్టిక్స్ సెక్టార్ కోర్సు) అందుబాటులోకి వస్తుంది. కొత్త కొత్త కోర్సులతో భవిష్యత్తులో మంచి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొంది అవకాశం ఉంటుంది. ఇంటర్ పాసైన అన్ని గ్రూపుల విద్యార్థులు చేయొచ్చు. ముఖ్యంగా పట్టణ, గ్రామీణ విద్యార్థులకు సౌకర్యకంగా మారనున్నది. మూడేళ్ల కోర్సులో మొదటి నాలుగు సెమిస్టర్లు పూర్తయిన తర్వాత ఫైనల్ ఇయర్‌లో రెండు సెమిస్టర్లు, ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఈ కోర్సులో 60 మందికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.

- డా.హుస్సేన్, ప్రిన్సిపల్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆడుకుంటున్న బాలుడి పైనుంచి దూసుకెళ్లిన ట్రాక్టర్


బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కొల్చారం, మే 16. ఆడుకుంటున్న బాలుడి పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన గురువారం మెదక్ జిల్లా కొల్చారం మండలం అప్పాజీపల్లిలో జరిగింది. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన బోసు రమేష్-శివలక్ష్మిల చిన్న కుమారుడు బోసు జస్వంత్(2). అయితే తమ భూమి పంచాయితీ నిమిత్తం రమేష్-శివలక్ష్మి గురువారం అప్పాజిపల్లికి వెళ్లారు. పాఠశాల సమీపంలో పంచాయితీ నిర్వహిస్తుండగా జస్వంత్‌ను విడిచిపెట్టడంతో అక్కడే ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ గమనించకుండా ట్రాక్టర్‌ను నడుపడంతో జశ్వంత్ పైనుంచి వెళ్లింది. డ్రైవర్ సయ్యద్‌పాషా నిర్లక్ష్యంగానే జస్వంత్ మృతిచెందాడని గ్రామస్థులు, మృతుడి కుటుంబసభ్యులు ట్రాక్టర్ యజమాని ఇంటి ముందు ఆందోళనకు దిగడంతో ఉద్రికత్త పరిస్థితి నెలకొంది. కొల్చారం ఎస్ఐ మహమ్మద్ గౌస్, ఏఎస్ఐ తారాసింగ్ చేరుకుని గ్రామస్థులకు, మృతుడి కుటుంబసభ్యులకు నచ్చజెప్పి పంపించారు.

కూలిన భవనం రెయిలింగ్

- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు


రెయిలింగ్ కూలి ధ్వంసమైన రేకుల ఇల్లు


మృతిచెందిన జయదేవ్(ఫైల్)

జిన్నారం, మే 16: రెండంతస్థుల భవనం రెయిలింగ్ కూలి ఒకరు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన బొల్లారం మున్సిపాలిటీలో చోటు చేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి 11:30 గంటలకు లక్ష్మీనగర్‌లోని రెండంతస్థుల భవనం రెయిలింగ్ కూలింది. ఈ ఘటనలో మొదటి అంతస్తు బాల్కానీలో నిద్రిస్తున్న దీపాకర్‌దాసు కాలుపై భవనం శిథిలాలు పడి పూర్తిగా ఛిద్రమైంది. భవనం పక్కన గల రేకుల ఇంటిపై శిథిలాలు పడటంతో అందులో నివసిస్తున్న జయదేవ్(50) మరణించాడు. అతడి భార్య సవిత, కుమారుడు రాకేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడు జయదేవ్ ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్‌కు చెందినవాడు. ఉపాధి కోసం వచ్చి స్థానికంగా నివసిస్తున్నాడు. కాగా బొల్లారం మున్సిపాలిటీలో శిథిలావస్థకు చేరిన భవనాలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా.. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడ్డారు. కాగా ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- పెద్దమ్మను కాపాడబోయి యువకుడు కూడా...
- దుస్తులు ఆరేస్తుండగా ప్రమాదం


మానెమ్మ(ఫైల్)


భానుప్రసాద్(ఫైల్)

శివ్వంపేట, మే 16: దుస్తులు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైన పెద్దమ్మను రక్షించేందుకు యత్నించగా మహిళతో పాటు యువకుడు మృతిచెందిన సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని ఉసిరికపల్లికి చెందిన నీరుడి మానెమ్మ (45) ఉదయం ఇంటి ముందు ఉన్న జీవో వైరు పైన దుస్తులను ఆరేస్తుంది. ఈ క్రమంలో మీటర్ దగ్గర తెగి ఉన్న సర్వీసు వైరు జీవో వైరుకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై మానెమ్మ కిందపడిపోయింది. గమనించిన ఆమె మరిది కొడుకు భానుప్రసాద్ (19) మానెమ్మను రక్షించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఆమెను పట్టుకోవడంతో అతను కూడా విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే ఇద్దరూ మృతిచెందారు. వారి అరుపులు విన్న మృతురాలి కూతురైన బాలింత శ్రీలత బయటకు వచ్చి తల్లి వద్దకు వెళ్లే క్రమంలో ఆమెకు కూడా షాక్ తగలడంతో వెంటనే స్థానికులు గమనించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపేశారు. శ్రీలతకు కూడా స్వల్పగాయలవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. భానుప్రకాష్ తండ్రి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అమెరికాలో జహీరాబాద్ వాసి మృతి

- రోడ్డు దాటుతుండగా ఢీకొట్టిన కారు


పృథ్వీరాజ్(ఫైల్)

జహీరాబాద్, మే 16: అమెరికాలోని చోర్లెట్ ప్రాంతంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన పృథ్వీరాజ్(35) మృతిచెందాడని కుటుంబసభ్యులు, బంధువులు రాజ్‌కుమార్ దేశ్‌పాండే తెలిపారు. భారత కాలమాన ప్రకారం బుధవారం రాత్రి 10 గంటల సమయంలో కారులో ఆరులేన్ల రోడ్డుపై వెళ్తున్న క్రమంలో ముందుగా నిల్చున్న వాహనాన్ని తప్పించబోయి కారు బోల్తా పడిందన్నారు. కారులో నుంచి పృథ్వీరాజ్ పక్కకు వెళ్లాడు. అయితే అమెరికా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగిన వెంటనే బోల్తాపడిన కారును అక్కడి పోలీసులకు ఫోన్ ద్వారా వాట్సాప్‌లో పెట్టాల్సి ఉంటుంది. అయితే పృథ్వీరాజ్ కారులో మరిచిపోయిన మొబైల్‌ను తీసుకునేందుకు వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. పృథ్వీరాజ్ మృతదేహం ఆదివారం రానున్నదని, హైదరాబాద్‌లోనే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు. మృతుడికి తల్లి, భార్య ఉన్నారు.

బీర్నిస్ @ రూ.240

- మండుతున్న కూరగాయల ధరలు
- ఆకు కూరల ధరలూ అంతేస్థాయిలో..


ఖేడ్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన బీర్నిస్

నారాయణఖేడ్, మే 16: కూరగాయల ధరలు మండుతున్నాయి. వివాహాల సీజన్ పూర్తయినా కూరగాయల ధరలకు రెక్కలు రావడంతో ప్రజలు కొనేందుకు భయపడుతున్నారు. ప్రస్తుతం బీర్నిస్ రికార్డుస్థాయిలో కిలో రూ.240 చొప్పున విక్రయిస్తున్నారు. నారాయణఖేడ్ మార్కెట్‌లో గురువారం కిలో బీరకాయలు రూ.100, వంకాయలు, బెండకాయలు కిలో రూ.60, క్యాప్సికం కిలో రూ.80 చొప్పున విక్రయించారు. నిమ్మకాయలు కూడా కిలో రూ.200, పాల కూర, మెంతెం కూర కిలో రూ.60 చొప్పున విక్రయిస్తున్నారు. కూరగాయల ధరలు ఈ విధంగా మండిపోతుండడంతో వాటిని కొనుగోలు చేయాలంటేనే భయమేస్తుందని ప్రజలు పేర్కొంటున్నారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా కూరగాయల ధరలు పెరగడం వింతగా ఉన్నదని వినియోగదారులు అంటున్నారు. కూరగాయల వ్యాపారులు మాత్రం ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఉండడంతో, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని, అందువల్ల దూర ప్రాంతాల నుంచి అధిక ధరలకు తీసుకొచ్చి విక్రయించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

వేడినీళ్లు పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

- ఇక్ఫాయ్ వర్సిటీలో ఘటన


గాయపడిన విద్యార్థిని

శంకర్‌పల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, ఇక్ఫాయ్ యూనివర్సిటీ హాస్టల్‌లో ఓ విద్యార్థిని శరీరంపై వేడినీళ్లు పడి తీవ్ర గాయాలయ్యాయి. వనస్థలిపురానికి చెందిన లేఖ్య. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ వర్సిటీ కాలేజీలో బీబీఏ(ఎల్ఎల్‌బీ) థర్డ్ ఇయర్ చదువుతోంది. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న లేఖ్య బుధవారం రాత్రి స్నానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లి గీజర్‌లోని నీటిని నేరుగా శరీరంపై పోసుకుంది. గీజర్‌లోని నీళ్లు అప్పటికే బాగా కాగి ఉండడంతో లేఖ్య కాళ్లు, చేతులు సహా పలు శరీర భాగాలకు కాలిన గాయాలయ్యాయి. నొప్పి భరించలేక లేఖ్య గట్టిగా అరవడంతో అక్కడికి చేరుకున్న సహచర విద్యార్థినులు విషయాన్ని యాజమాన్యం, లేఖ్య తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక్ఫాయ్ యాజమాన్యం లేఖ్యను ఆస్పత్రికి తరలించింది. దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓమ్ని ఆస్పత్రిలో లేఖ్య ప్రస్తుతం చికిత్స పొందుతోంది. కాగా, ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగ్ పోలీసులు గురువారం ఉదయం కళాశాలకు వెళ్లి విచారణ చేశారు. విద్యార్థినిపై యాసిడ్ దాడి జరిగిందంటూ సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వార్తలు అసత్యమని నార్సింగ్ ఏసీపీ రమణాగౌడ్ స్పష్టం చేశారు.

ట్రేడ్ లైసెన్స్‌కు రూ. 30 వేలు డిమాండ్

- ఏసీబీ వలలో నర్సాపూర్ వ్యవసాయశాఖ ఏవో



ఏసీబీకి చిక్కిన వ్యవసాయశాఖ ఏవో అనిల్ కుమార్

నర్సాపూర్, మే 16: ట్రేడ్ లైసెన్స్ కోసం రూ. 30 వేల లంచం డిమాండ్ చేసిన మెదక్ జిల్లా నర్సాపూర్ వ్యవసాయ శాఖ ఏవో అనిల్‌కుమార్ ఏసీబీ వలలో చిక్కారు. నిజామాబాద్ జిల్లా బోదన్ మండలం సాలుర గ్రామానికి చెందిన వంగానరేస్ అనే వ్యాపారి శివశక్తి అగ్రో ఏజెన్సీస్ పేరిట ఓ కంపెనీని ప్రారంభించేందుకు ట్రేడ్ లైసెన్స్ కోసం నర్సాపూర్ వ్యవసాయశాఖ ఏవో అనిల్‌కుమార్‌ను కలిశారు. లైసెన్స్ కావాలంటే రూ. 30 వేలు లంచం కావాలని ఏవో డిమాండ్ చేయగా వంగానరేస్ ఆ విషయాన్ని ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం.. ఏవో అనిల్‌కుమార్ వంగానరేస్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

రంగనాయకసాగర్ ప్రాజెక్టులో దూకి యువతి ఆత్మహత్య


సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు, బంధువులు


అశ్విని(ఫైల్)

చిన్నకోడూరు/సిద్దిపేట క్రైం, మే 16: చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టులో దూకి ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణం శంకర్‌నగర్‌కు చెందిన ఇరగదిండ్ల రాజేశ్వరిశ్రీనివాస్ దంపతుల కూతురు అశ్విని(23) డిగ్రీ పూర్తి చేసింది. ఈ నెల 13న సాయంత్రం అమ్మమ్మ వాళ్ల ఇంటికి వెళ్తున్నానని చెప్పిన అశ్విని తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అదేరోజు సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా బుధవారం రాత్రి రంగనాయకసాగర్ ప్రాజెక్టు నీటిలో గుర్తు తెలియని యువతి మృతదేహం తేలి ఉండటాన్ని కొంతమంది చేపలు పడుతున్న వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకుతీసి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం విషయం తెలిసిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని అశ్విని మృతదేహంగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా అశ్విని మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాలకు చెందిన శ్రావణ్ అనే యువకుడితో ప్రేమలో ఉన్నట్లు తెలిసింది. అతనిపై అనుమానం ఉన్నదని చెప్పడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని పోలీసులు తెలిపారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య


గేరుగంటి ఎల్లయ్య (ఫైల్)

నిజాంపేట, మే 16: పంటకు చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన గేరుగంటి ఎల్లయ్య(45) వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం తెలిసిన వారి వద్ద సుమారు రూ.4 లక్షలు అప్పు చేశాడు. పంటలు సరిగా పండకపోవడంతో పాటు అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి ముందు ఉన్న వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

లేగ దూడపై చిరుత దాడి

- భయాందోళనలో గ్రామస్థులు

రామాయంపేట, మే 16: రామాయంపేట మండలం దంతేపల్లి శివారు పశువుల కొట్టంపై బుధవారం రాత్రి చిరుత దాడిచేసి ఓ లేగ దూడను హతమార్చింది. ఈ ఘటనతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చాలారోజుల తర్వాత తిరిగి చిరుత సంచారంతో తమ పొలాలకు వెళ్లేందుకు రైతులు జంకుతున్నారు. గ్రామానికి చెందిన రైతు భూదవ్వ ఎప్పటిలాగే తమ వ్యవసాయ పొలం వద్ద ఉన్న పశువుల పాకలో లేగ దూడలను కట్టేసింది. గురువారం ఉదయం చూసేసరికి ఓ దూడ చనిపోయి ఉన్నది. చిరుత ఆనవాళ్లు ఉండడంతో గ్రామస్థులు అటవీ అధికారులకు సమాచారం అందించారు.

నత్తనడకన ఔటర్ కొల్లూరు ఆర్‌వోబీ జంక్షన్

- ప్రమాదకరంగా మారిన సర్వీస్ రోడ్డు
- పాటి, ఘనాపూర్, వెలిమెల గ్రామాలకు రవాణా ఇబ్బందులు
- రియల్ ఎస్టేట్ విస్తరణకు అడ్డంకిగా సర్వీస్ రోడ్డు


నత్తనడకన సాగుతున్న కొల్లూరు ఔటర్ రింగ్ రోడ్డు ఆర్‌వోబీ పనులు


ప్రమాదకరంగా కొల్లూరు-పాటీ మధ్యన ఉన్న మట్టిరోడ్డు

సంగారెడ్డి/పటాన్‌చెరు, మే 16 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుపై కొల్లూరు జంక్షన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులు నత్తనకన కొనసాగుతున్నాయి. 'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందాన ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లకు అనుబంధంగా ఉన్న కొల్లూరు జంక్షన్‌లో నాగులపల్లి రైల్వే ట్రాక్‌పై ఆర్‌వోబీ లేకపోవడంతో ఔటర్ రోడ్డుకు సర్వీస్ రోడ్డు లేకుండాపోయింది. ముఖ్యంగా గోల్డెన్ ట్రయాంగిల్ అని రియల్ ఎస్టేట్ వర్గాలు పిలుచుకునే కొల్లూరు, నాగులపల్లి, వెలిమెల, పాటి, ఘనాపూర్, నందిగామ, భానూర్, కొండకల్, మోకిల తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ ఆశించిన స్థాయి విస్తరించకపోవడానికి ఔటర్ వద్ద సర్వీస్‌రోడ్డు లేకపోవడమే ప్రధాన అడ్డంకిగా భావిస్తున్నారు. జంక్షన్ పరిసరాల్లో పెద్ద ఎత్తున గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు ఇప్పుడిప్పుడే వస్తున్నా.. సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో కొనుగోలుదారులు అడిగే ప్రశ్నలకు రియల్‌ఎస్టేట్ సంస్థలు నీళ్లు నములుతూ వస్తున్నాయి. గత పదేళ్లుగా సర్వీస్ రోడ్డు విస్తరణ కోసం నాగులపల్లి రైల్వే ట్రాక్‌పై ఆర్‌వోబీ నిర్మించాలని పెద్దఎత్తున విజ్ఞప్తులు రావడంతో ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఆర్‌వోబీ పనులు ప్రారంభించింది. ఔటర్ రోడ్డుకు రెండువైపుల రైల్వే ట్రాక్‌పై బ్రిడ్జిల నిర్మాణం ప్రారంభమయ్యాయి. దీంతో రియల్ వర్గాల్లో ఆశలు చిగురించాయి. ఆర్‌వోబీ పనులు పూర్తయితే మెరుగైన రవాణా వ్యవస్థ ఏర్పడుతుందని అన్నివర్గాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఆర్అండ్‌బీ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు ఆశించినస్థాయిలో జరగడం లేదు. ఇందుకు అవసరమైన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయకపోవడం వల్లే కాంట్రాక్టర్ పనులను చేపట్టడం లేదని తెలుస్తున్నది.

ప్రమాదకరంగా మట్టి రోడ్డు

కొల్లూరు జంక్షన్ వద్ద కొల్లూరు వైపు నుంచి పాటి, ఘనాపూర్ వైపు వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఓ చిన్న మట్టి రోడ్డును నిర్మించారు. కొల్లూరు, పాటి వైపు వెళ్లే వాహనాలకు ఇదే దారి. చిన్న మట్టి రోడ్డు ఉండటం వల్ల వచ్చే వాహనాలు, వెళ్లే వాహనాలు ఎదురెదురుగా రావడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భారీ వాహనాలు, టిప్పర్లు, విద్యాసంస్థలు, పరిశ్రమల బస్సులు వెళ్లే సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక వర్షాకాలంలో ఇబ్బందులు వర్ణనాతీతం. మట్టి రోడ్డును బీటీరోడ్డుగా మారుస్తామని స్థానిక నాయకులు, హెచ్ఎండీఏ అధికారుల ఇచ్చిన హామీలు నెరవేరలేదు. కాంట్రాక్టు నిబంధనల ప్రకారం ఈ ఏడాది చివరివరకు ఆర్‌వోబీ పనులు పూర్తి జరిగి జంక్షన్‌కు ఇరువైపులా సర్వీస్ రోడ్డు అందుబాటులోకి రావాలి. కానీ పనుల్లో జాప్యం, మందకొడిగా బ్రిడ్జి నిర్మాణం జరగతుండటంతో ఆర్‌వోబీ పనులు మరో రెండేళ్లు పట్టే అవకాశాలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాల్సిన ఆర్‌వోబీ పనుల్లో జాప్యంపై అధికారులు సమీక్షలు నిర్వహించి వేగం పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సర్వీస్ రోడ్డు పనులు జరిగితేనే స్తబ్ధంగా ఉన్న రియల్ ఎస్టేట్ పరుగులు పెట్టే అవకాశం ఉన్నదని వ్యాపారులు భావిస్తున్నారు.

సన్నాలకే బోనస్ ఇస్తామంటూ కాంగ్రెస్ మోసం

- రైతుల పాలిట శాపమైన కాంగ్రెస్ పాలన
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు
- ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసనలు

సంగారెడ్డి రూరల్, మే 16: పార్లమెంట్ ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరిధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించి, ఎన్నికల తర్వాత మాట మార్చి కేవలం సన్నాలకే ఇస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమేనని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. పార్టీ పిలుపు మేరకు గురువారం నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయం ఎదు ధర్నా జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం రైతుల పాలిట శాపమైందన్నారు. అధికారంలోకి రావాలనే కాంక్షతో ఇష్టానుసారంగా హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయలేక అధికారుల మీదకు నెడుతున్నదని విమర్శించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కంది జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మనోహర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, కంది మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, మ్యాకం విఠల్, మధుసూదన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, మందుల వరలక్ష్మీ, పాండురంగం, వెంకటేశ్, గోవర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునితారెడ్డి, జోగిపేటలో క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అబద్ధాలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్

నర్సాపూర్: కాంగ్రెస్ అబద్ధాలతో కాలం వెల్లదీస్తూ రైతులను నిలువునా మోసం చేస్తున్నదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. నర్సాపూర్‌లో నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందన్నారు. రుణమాఫీ లేకపోగా సన్న రకం ధాన్యానికే బోనస్ అంటూ సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీటీసీ బబియానాయక్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, పార్టీ మండలాధ్యక్షుడే శేఖర్, రమణాగౌడ్, రామాగౌడ్, హత్నూర ఎంపీపీ నర్సింహులు, వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, మాజీ ఎంపీటీసీలు సత్యంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దామోదర్‌రెడ్డి, సింగాయపల్లి గోపి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం చేస్తాం

నారాయణఖేడ్: రైతులు పండించిన అన్నిరకాల ధాన్యానికి బోనస్ ఇవ్వడంతో పాటు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు నర్సింహారెడ్డి, విజయరామరాజు, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు అలీ, ఎంపీపీలు జంగం శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, మండలాల బీఆర్ఎస్ అధ్యక్షులు పరమేష్, సంజీవ్‌రావు, ఖేడ్ పట్టణ అధ్యక్షుడు నగేష్, మండల రైతు సమన్వయ సమితి మాజీ కో ఆర్డినేటర్ సత్యపాల్‌రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ దిలీప్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బాసిత్, నాయకులు ప్రభాకర్, సంగప్ప, గంగారాం, మల్గొండ, సాయాగౌడ్, మాణిక్‌రెడ్డి, నవాబ్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

మెదక్ అర్బన్: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా అదనపు కలెక్టర్ రమేష్‌కు రైతుల తరఫున వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాలకు మొలకెత్తిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు సోములు, కౌన్సిలర్ అంజనేయులు, మాజీ కౌన్సిలర్ మల్లేశం పాల్గొన్నారు.

మాట మార్చిన కాంగ్రెస్ సర్కార్

జోగిపేట: పార్లమెంట్ ఎన్నికలకు ముందు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఎన్నికలు ముగియగానే మాట మార్చడం తగదని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. జోగిపేటలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు రకాలనే పండిస్తారని తెలిసి కూడా సర్కార్ ఇలా ప్రకటించడం రైతులను మోసం చేయడమేనన్నారు. ఓట్ల కోసం రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రజల ప్రయోజనాల గురించి ఆలోచించడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డీ.బీ.నాగభూషణం, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు హెచ్.రామాగౌడ్, పార్టీ మండలాధ్యక్షులు లక్ష్మీకాంత్‌రెడ్డి, వీరప్ప, బుచ్చయ్య, శివకుమార్, విజయ్‌గుప్తా, పార్టీ పట్టణ అధ్యక్షుడు సార శ్రీధర్, నాయకులు లింగాగౌడ్, చాపల వెంకటేశం, పత్తి వీరేశంగుప్తా, విఠల్, శంకరయ్య, నర్సింహులు, ఇమ్మయ్య, దుర్గారెడ్డి, సంతోష్, వడ్ల శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.



మెదక్‌లో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు



నారాయణఖేడ్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

వెల్దుర్తి, మే 16: మండల కేంద్రమైన వెల్దుర్తిలోని శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు కళాశాలలో బైపీసీ, సీఈసీ, ఎంపీసీ గ్రూప్‌లలో చేరేందుకు అవకాశాలున్నట్లు తెలిపారు. అడ్మిషన్లను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు కోరారు.

బుదేరా జూనియర్ కళాశాలలో

మునిపల్లి: మండలంలోని బుదేరా చౌరస్తా సమీపంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం, సీఈసీ తెలుగు మీడియంలో సీట్లు ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి పాసై, ఆసక్తి గల విద్యార్థులు ఇంటర్నెట్ మెమో, ఆధార్ కార్డును తీసుకువచ్చి ఇష్టమైన గ్రూపులలో చేరవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ హిమబిందుతోపాటు అధ్యాపకులు కోరారు. కళాశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

శివ్వంపేట మండలంలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శివ్వంపేట, మే 16: మండల పరిధిలోని పాంబండ సబ్ స్టేషన్లలో మరమ్మతు కారణంగా శుక్రవారం పాంబండ, ఉసిరికపల్లి, గ్రామాలతో పాటు భీమ్లా తండాలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు గురువారం ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



చిలప్‌చెడ్, మే 16: చిలప్‌చెడ్ మండలం గంగారంలో విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. గంగారం తండాకు చెందిన గూగుల్ శ్రీను పశువులను మేపుతుండగా ఒక ఎద్దు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.లక్ష 20వేలు ఉంటుందని తెలిపారు.

సోషల్ మీడియా కో ఆర్డినేటర్ల సమావేశంలో నాయకులు

నారాయణఖేడ్, మే 16: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో గురువారం టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఖేడ్ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌లు నందీష్, భూపాల్‌రెడ్డి, నియోజకవర్గంలోని మండలాల కో ఆర్డినేటర్‌లు విజయ్, విజయ్‌కుమార్ స్వామి, ప్రకాష్, మూఢ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీకాంత్

జోగిపేట, మే;16: జోగిపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో మాజీ గవర్నర్ రవీంద్రగౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యువ న్యాయవాది అల్లె శ్రీకాంత్, కార్యదర్శిగా యువ జర్నలిస్టు గడ్డమీది సంతోష్‌కుమార్, కోశాధికారిగా ప్రముఖ నాయకుడు జీఆర్ మధుసూదన్‌రెడ్డి ఎన్నికయ్యారు.

రేపు స్వాముల వారి ఆరాధన

నారాయణఖేడ్, మే 16: పోతన్‌పల్లి. ఆర్‌లో శనివారం విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ఆరాధన మహోత్సవాలను నిర్వహించనున్నట్లు వీరబ్రహ్మేంద్రస్వాముల వారి ధ్యాన ఆశ్రమ నిర్వాహకులు వడ్ల విఠలాచారి గురువారం ప్రకటనలో తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి అల్లీపూర్‌లో క్రైస్తవ ఉజ్జీవ సభల జాతర

జహీరాబాద్, మే 16: జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్‌లో గల మెథడిస్ట్ చర్చి వద్ద 94వ క్రైస్తవ ఉజ్జీవ సభల జాతరను నేటి నుంచి నిర్వహించనున్నట్లు ఉత్సవకమిటీ సభ్యులు, నిర్వాహకులు జాన్‌వెస్లీ, జిల్లా లేలీడర్ సరీన్‌జాన్, కార్యదర్శి రవికుమార్ తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బెస్ట్ అవైలెబుల్ పథకం ద్వారా ఉచిత విద్య

నారాయణఖేడ్, మే 16: బెస్ట్ అవైలెబుల్ పథకం ద్వారా 2024-25 విద్యా సంవత్సరంలో తమ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతిలో ప్రవేశం పొందిన వారికి పదవ తరగతి వరకు ఉచిత విద్యను అందించనున్నట్లు నియోప్రగతి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా ఎంపికైన విద్యార్థులకు పదవ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 7382174758, 9666953935 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు అభినందన

సంగారెడ్డి రూరల్, మే 16 : కరాటే కుంగ్‌ఫూలో ఉత్తమ ప్రతిభ కనబర్చి, అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అభినందించారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామానికి చెందిన విద్యార్థులు శేషువర్ధన్, ఉజ్వల, శ్రీభారతిలు కరాటే కుంగ్‌ఫూలో అంతర్జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఫసల్‌వాది గ్రామంలో గురువారం విద్యార్థులను మాణిక్యం అభినందించి మాట్లాడారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి కరాటే కుంగ్‌ఫూలో అంతర్జాతీయ స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. విద్యార్థులు టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అవసరమయ్యే ఖర్చులను పట్నం మాణిక్యం ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేస్తామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కోచ్‌లు పులంగారి మల్లేశం, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం

మర్కుక్, మే 16: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి లక్ష పైచిలుకు మెజార్టీతో విజయం సాధిస్తారని మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఆయన మండల కోఆప్షన్ సభ్యులు అక్కాకుల సాహెర, నరేష్‌తో కలిసి గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి పార్టీ శ్రేణులతో కలిసి క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసామని, నిద్రాహారాలు మాని బీఆర్ఎస్ గెలుపు కోసం కష్టపడ్డామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ విధానాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, తమ ప్రభుత్వ హయాంలో పది లక్షలమందికి పైగా లబ్ధిదారులు వివిధ పథకాలు పొందారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్య తదితరులున్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలి

సిద్దిపేట క్రైం, మే 16: ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని జిల్లా జడ్జి సాయి రమాదేవి సూచించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా జైలును గురువారం ఆమె సందర్శించారు. ఖైదీల కేసుల వివరాలను పరిశీలించారు. వంటగది, స్టోర్ రూమ్, టాయిలెట్స్‌ను పరిశీలించారు. ఖైదీలకు కల్పిస్తున్న భోజన వసతుల గురించి జిల్లా జైలు సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ బాలయ్య, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, జిల్లా కోర్టు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, జిల్లా న్యాయసేవాధికారుల సంస్థ సిబ్బంది సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమష్టిగా సమస్యలను పరిష్కరించుకుందాం

- మండల సమావేశంలో ఎంపీపీ లావణ్య

సంగారెడ్డి రూరల్, మే 16: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుందామని ఎంపీపీ లావణ్యాదుర్గేష్ అన్నారు. సంగారెడ్డిలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఆమె అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు చూడాలన్నారు. ఏపీఎం వెంకట్ మాట్లాడుతూ.. మహిళా సమాఖ్య సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి రుణాలు లక్ష్యం మేరకు అందిస్తున్నామని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు 35 మందికి మంజూరు కాగా వారికి రూ.14 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి ఏవీజీకే ప్రసాద్ మాట్లాడుతూ.. మండలంలో 19 మంది రైతులు మృతిచెందగా వారిలో 18 మందికి రైతుబీమా డబ్బులు చెల్లించామని చెప్పారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ

కంది, మే 16: గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకంపై సంవత్సరానికి ఒకసారి జరిగే సామాజిక తనిఖీ కందిలో అభాసుపాలవుతుంది. ఎన్నికల కోడ్ కారణంగా బహిరంగంగా నిర్వహించాల్సిన సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీవో కార్యాలయం పక్కనే ఉన్న జడ్పీ పాఠశాలలోని ఓ తరగతి గదిలో ఏర్పాటు చేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి బదులు అడిషనల్ పీడీ బాలరాజ్ హాజరయ్యారు. సామాజిక తనిఖీ బృందం ఆయా గ్రామాల వారీగా ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకలను వివరించారు. సంవత్సరం నుంచి మండలంలో దాదాపు రూ.రెండు కోట్ల పనులు జరిగాయని, హరితహారంలో నాటిన మొక్కలు చనిపోయాయని, ఎంబీ రికార్డులపై సంతకాలు లేకుండానే బిల్లులు జారీ అయినట్లు వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే అధికారులు మాత్రం హెచ్చరికలతోనే సరిపెట్టి సమావేశాన్ని మమ అనిపించేశారు. దీంతో సామాజిక తనిఖీ సమావేశంపై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో ఏపీవో నాగేశ్వరావు, ఎస్ఆర్‌పీ బాలు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయాలి

- మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్

చిన్నశంకరంపేట, మే 16: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరగా పూర్తి చేయాలని మెదక్ డీఈవో రాధాకిషన్ అధికారులకు సూచించారు. చిన్నశంకరంపేట మండలంలోని 33 అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను జూన్ నెలాఖరు వరకు పూర్తి చేసేందుకు గురువారం విద్యా వనరుల కేంద్రంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని పాఠశాలల్లో వసతులు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎంవో సుదర్శన్‌మూర్తి, నవీన్, పీఆర్‌ఏఈ విజయ్, ఎంఈవో బుచ్చయ్యనాయక్ పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

జూన్ నాటికి పనులన్నీ పూర్తి చేయాలి

తూప్రాన్: తూప్రాన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం తూప్రాన్, మనోహరాబాద్ మండలాలల అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సమావేశం నిర్వహించారు. మండల విద్యాధికారి బుచ్చానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి జిల్లా విద్యాధికారి రాధాకిషన్ హాజరై మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు జూన్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎంవో సుదర్శనమూర్తి, ఏఎస్‌వో నవీన్, ఘనపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఏపీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- పీఆర్సీ కమిషన్ చైర్మన్‌కు వినతి



పీఆర్సీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

వెల్దుర్తి/చేగుంట, మే 16: శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎస్టీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం కోరారు. ఈ మేరకు గురువారం పీఆర్సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌కు ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సంఘ సభ్యులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీటీలకు 12 ఏళ్లకు ఎస్‌ఏ స్కేలు, 24 ఏళ్లకు పీజీహెచ్‌ఎం వేతనాన్ని ఇవ్వాలని కోరారు. ప్రాథమిక స్థాయిలో బోధించే టీచర్లకు అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా గౌరవప్రదమైన వేతనాలు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ విరమణ అనంతరం వచ్చే అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలు ఉద్యోగికి ఉద్యోగ విరమణ రోజే అందించాలని, ఉపాధ్యాయులు ఎదుర్కుంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. పీఆర్టీయూ తెలంగాణ గౌరవ వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర, జిల్లాల నాయకులతో కలిసి ఉపాధ్యాయ సమస్యలపై పీఆర్సీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రాన్ని అందజేసినట్లు చేగుంట మండలాధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు.

బీటీ-3 రకం విత్తనాలను విక్రయించొద్దు

- రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ

మునిపల్లి, మే 5: రైతులకు బీటీ-3 రకం పత్తి విత్తనాలను విక్రయించవద్దని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ ఫర్టిలైజర్ షాపుల డీలర్లు, వ్యవసాయాధికారులకు సూచించారు. గురువారం మండలంలోని బుదేరా రైతువేదికలో ఫర్టిలైజర్ షాపుల డీలర్లు, వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్నందున నాణ్యమైన ఎరువులు, విత్తనాలను కనీస ధరలకు అమ్మడంతో పాటు రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమకు సమాచారం వస్తే తనిఖీలు చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు ఆధార్ కార్డుతో ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. ఏఈఓలు రైతులకు రైతు వేదికల్లో అందుబాటులో ఉండి రైతుబంధు, రైతుబీమా, పంటల నమోదు ప్రక్రియ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏవో శివకుమార్, ఎస్ఐ సురేష్, ఏఈఓలు లావణ్య, స్నేహ, రెహమాన్, మహేందర్, డీలర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణ

డెంగీపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జాతీయ డెంగీ దినోత్సవంలో వైద్యాధికారుల సూచన

చేగుంట, మే 16: డెంగీ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి అనిల్‌కుమార్ సూచించారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలిసి చేగుంటలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో డాక్టర్ అనిల్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసర ప్రాంతాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు అధికమై డెంగీ సోకే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వరుసగా రెండు మూడు రోజులు జ్వరంతో బాధపడితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి మృదుల, సీహెచ్‌వోలు సంపతి, కిషన్, సూపర్‌వైజర్ పద్మ, ల్యాబ్ టెక్నీషియన్ నర్సింలు, సిబ్బంది దుర్గా, సోనీ, మనోహర్, ఏఎన్‌ఎంలు జ్యోతి, కిరణ్‌కుమారి, అనురాధ, ప్రమీల, రుపాదేవి, పద్మ, అనిత, సుజాత పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ

పెద్దశంకరంపేటలో

పెద్దశంకరంపేట: మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మండల వైద్యాధికారి వేదశ్రీ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది గురువారం పురవీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి యాదయ్య, సిబ్బంది సాయిలు, వెంకటేశం, రమణ, కమల, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఫ్లెక్సీతో అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షురాలి మృతి



లక్ష్మి (ఫైల్)

చేగుంట, మే 16: ఉల్లితిమ్మాయిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు అతుకురి పెద్ద లక్ష్మి(45) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆమె కుటుంబ సభ్యులకు మండల పార్టీ అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో సంద్రుగు శ్రీకాంత్ ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేసిందని, ఆమె మరణం చాలా బాధాకరమని, ఆమె కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మండల పార్టీ అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్ పేర్కొన్నారు. ఆమె కుటుంబ సభ్యులను గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్ర రాజకుమార్, రాకేష్, బాబు, నర్సింలు పరామర్శించారు.

రేపు వాసవీ మాత జయంతి

నారాయణఖేడ్, మే 16: ఈ నెల 18న వాసవీ మాత జయంతిని నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు. సాయి బాబా ఆలయం ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.